క్లుప్తంగా

5న బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మహాసభ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రథమ మహాసభను నవంబర్ 5వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్నట్లు బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ జి.వి.రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆటోనగర్‌లోని బీసీఈఎఫ్ కార్యాలయంలో కార్యక్రమం పోస్టర్‌ను ప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె.వి.ఆర్.మూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.చిన్నారావు, నాయకులు బి.నాగేశ్వరరావు, గొలగాని సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెంకన్న గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: పౌర్ణమి సందర్భంగా భక్తులు స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ చేశారు. ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో సాగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరి స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువ జామున వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విస్తృతంగా మానవతా సంస్థ సేవలు


మహిళలకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గాజువాక: మానవతా సేవా సంస్థ గాజువాక యూనిట్ ఆధ్వర్యంలో శనివారం వివిధ సేవలను అందించారు. మహిళా ఆరోగ్య వికాస్ పేరిట 85 మందికి క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యురాలు లీల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, గైనిక్ క్యాన్సర్‌ల పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఒక దివ్యాంగుడికి ట్రై సైకిల్, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాజువాక ఎస్ఐ సూర్యకళ, ట్వింకిల్ స్కూల్ కరస్పాండెంట్ దొడ్డి శ్యామ్, మాజీ కౌన్సిలర్ డీఈవీ అప్పారావు, మానవతా సంస్థ గాజువాక చైర్మన్ డి.కృష్ణంరాజు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఈ- హుండీ పునరుద్ధరణ


ఫోన్‌తో స్కాన్ చేసి నగదు చెల్లిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై ఈ హుండీని శనివారం నుంచి పునరుద్ధరించారు. సింహగిరికి వచ్చే భక్తుల సౌకర్యార్థంర్థం గోగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం ద్వారా హుండీ కానుక చెల్లించే విధానం గతంలో ఉండేది. కొన్ని కారణాల దృష్ట్యా దాన్ని నిలిపివేశారు. తాజాగా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈ హుండీ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనిలో భాగంగా ఆలయ రాజగోపురం వద్ద స్కానర్ ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని స్కానర్లు ఏర్పాటు చేస్తామని ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో- ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌దే
- సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలి
- పార్టీ శ్రేణులకు వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి దిశానిర్దేశం

పెదగంట్యాడ: వచ్చే ఎన్నికల్లో గాజువాకలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయాలని పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని, దానిని కొనసాగించేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులతో శనివారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా పేద ప్రజల సంక్షేమ పథకాల కోసం రూ. 2లక్షల 35వేల కోట్లు వెచ్చించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు.

విద్య– వైద్యానికి అధిక ప్రాధాన్యం

సంక్షేమ పథకాలతో పాటుగా అభివృద్ధి పనులకు సీఎం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. పేదల చెంతకు వైద్యం అందించేందుకు ఎన్నో కార్యక్రమాలను రూపకల్పన చేశారని చెప్పారు. ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, ఫ్యామిలీ ఫిజీషియన్ తదితర కార్యక్రమాలతో పాటు ఆరోగ్య సురక్ష ద్వారా పేదల చెంతకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం చెప్పుకోదగిన అంశమన్నారు. గడిచిన నాలుగున్నర ఏళ్లలో అందజేసిన సంక్షేమ పథకాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 70 శాతం అందజేశామన్నారు, అలాగే పదవుల్లోనూ వారికే తగిన పాధాన్యం ఇస్తున్నామన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. భవిష్యత్ మనదేనని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగడం ఖాయమని అన్నారు. టీడీపీ నాయకుల తప్పుడు విమర్శలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే నెల 6న మంత్రుల సామాజిక సాధికార యాత్ర పాతగాజువాక కూడలికి వస్తుందని, పార్టీ నాయకులు అందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు అన్ని సచివాలయాల పరిధిలో 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణులు అందరూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. అలాగే చంద్రబాబు చేసిన మోసాలను ప్రతీ ఆడపడుచుకు తెలియజేయాలన్నారు.

వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాలి

విశాఖ నగర అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ ప్రభుత్వంపై బురద జల్లే ప్రతిపక్షాల చిల్లర మాటలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీలోని ప్రతీ నాయకుడిపై ఉందన్నారు. గత ఎన్నికల్లో ఎంతో కష్టపడి పనిచేసి, సినిమా స్టార్ పవన్‌కల్యాణ్‌పై తిప్పల నాగిరెడ్డిని ఎలా గెలిపించారో వచ్చే ఎన్నికల్లోనూ అదేవిధంగా సత్తా చాటాలన్నారు.

మరో 30 ఏళ్లు జగనన్నే సీఎం

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పాలనను ప్రతీ ఇంటికి వివరిద్దామన్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలోనూ జగనన్న సైనికులు దూసుకుపోవాలన్నారు. పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేస్తే మరో 30 ఏళ్ల పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక పరిశీలకుడు సీతంరాజు సుధాకర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నరసింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, రాజాన వెంకటరావు, చందు, ఇమ్రాన్, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చిన తల్లి, కోమటి శ్రీను, రోజా రాణి, మండల అధ్యక్షులు ధర్మాల శ్రీను, రాజాన వెంకటరావు, బొడ్డ గోవింద్, క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, నాయకులు దొడ్డి రమణ, నక్క వెంకటరమణ, గొందేశి వెంకటరమణారెడ్డి, వై.మస్తానప్ప, మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన నాయకులు, పార్టీ శ్రేణులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

'చేదోడు' లబ్ధిదారుల హర్షం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


మిందిలో సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: 'జగనన్న చేదోడు' పథకం అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఈ ఏడాది రూ.10 వేలు టైలర్లు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఏటా రూ.10 వేలు అందించడంతో వారంతా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీ వినాయక దుర్గా టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 68వ వార్డు మింది బస్‌స్టాప్‌లో జగనన్న చేదోడు లబ్ధిదారులైన టైలర్స్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడల లతీష్ చేతులమీదుగా క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా లతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. అందరూ బాగుండాలనే ఆకాంక్షతో పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఆయనకు అండగా ఉందామన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా టైలర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అతికినిశెట్టి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కె.మల్లికేశ్వరరావు, న్యాయసలహాదారులు టి.పుల్లయ్య నాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు దొడ్డి శ్రీను, కార్యదర్శి బి.గంగరాజు, కోశాధికారి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వికాస్‌నగర్‌లో రూ.88 లక్షలతో అభివృద్ధి పనులు


భూమిపూజ చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్‌నగర్‌లో రూ.88 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి మాట్లాడారు. ఇక్కడ రక్షణ గోడ నిర్మాణంతో పాటు వికాస్‌నగర్ సంక్షేమ సంఘం భవనం పునరుద్ధరణ పనులు చేపట్టనున్నామని తెలిపారు. కొండవాలు ప్రాంతాల ప్రజల అవసరాన్ని గుర్తించి రక్షణ గోడ నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, నాయకులు పాల్గొన్నారు.

ఆలిండియా కబడ్డీ పోటీలకు గంగవరం క్రీడాకారులు


కారి లక్ష్మణరావు


సత్యనారాయణ

పెదగంట్యాడ: కేరళలోని ఎర్నాకుళంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు నిర్వహించనున్న ఆలిండియా కబడ్డీ పోటీలకు గంగవరం గ్రామానికి చెందిన కారి లక్ష్మణరావు, వి.సత్యనారాయణ ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యారు. ఉక్కునగరం సెక్టార్–6 లో పోస్టల్ ఉద్యోగిగా పని చేస్తున్న లక్ష్మణరావు, నేవల్ బేస్ పోస్టాఫీసులో పని చేస్తున్న సత్యనారాయణ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రో కబడ్డీ, ఆలిండియా ప్రో కబడ్డీ పోటీల్లో కూడా వీరు ప్రతిభ కనబరిచారు. విశాఖ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.రాహుల్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ హరిప్రసాద్, విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాద్‌రెడ్డి వారిని అభినందించారు. ఉక్కునగరం పోస్ట్ మాస్టర్ తేజేశ్వరి, ఆదినారాయణ తదితరులు లక్ష్మణరావును, నేవల్ బేస్ పోస్టాఫీస్ పోస్ట్‌మాస్టర్ సత్యనారాయణను అభినందించారు.

ఘనంగా వాల్మీకి జయంతి


వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: రామాయణమే మన జీవన పారాయణమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని 76వ వార్డు నడుపూరులో వాల్మీకి బోయ సేవా సంఘం సభ్యులు పల్లం గోపి, పాముల ఉమా మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రపంచానికి పరమ పవిత్రమైన రామాయణాన్ని వరంగా ఇచ్చిన ఆదికవి వాల్మీకి మహర్షి అన్నారు. భారతీయ సనాతన ధర్మ వారధి వాల్మీకి మహర్షి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 76వ అధ్యక్షుడు దొడ్డి రమణ, వార్డు సీనియర్ నాయకుడు మంత్రి శంకర నారాయణ, సీర చిన్నారావు, జె్రిపోతుల సురేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయి దివ్య జ్యోతితో విశ్వకాంతులు

- శ్రీ సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధి రత్నాకర్
- రాష్ట్రస్థాయి యువజన సదస్సు ప్రారంభం


ఆధ్యాత్మిక పత్రికను ఆవిష్కరిస్తున్న అతిథులు

పెదగంట్యాడ: భగవాన్ సత్య సాయిబాబా వెలిగించిన దివ్వెలు విశ్వకాంతులు వెదజల్లుతున్నాయని శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి ఆర్‌జే రత్నాకర్ అన్నారు. సాయిబాబా ఒక సత్సంకల్పంతో బలమైన పునాది వేశారని, దీని ఆధారంగా లక్షలాది మంది మానవతా విలువలతో విశ్వవ్యాప్తంగా అనేక దేశాలలో నిస్వార్థంగా సేవలందిస్తున్నారని చెప్పారు. జీవీఎంసీ 77వ వార్డు ఏపీ మెడ్‌టెక్ జోన్‌లోని ఆంపియర్ హాల్లో రాష్ట్ర యువజన సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, పేదలు, అణగారిన వర్గాలకు సేవలందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. సత్యసాయి సేవా సంస్థలో యువత పెద్ద సంఖ్యలో చేరి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు.

ముందుగా ప్రశాంతి పతాకను సత్యసాయి సేవా సంస్థల ఆలిండియా అధ్యక్షుడు నిమిష్ పాండ్య, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, వీ స్టీల్ మహిళా సేవా సమితి ప్రెసిడెంట్ నుపుర్ భట్, ఏపీ మెడ్‌టెక్ జోన్ ఎండీ, ఫౌండర్ సీఈవో జితేంద్ర శర్మ, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌జీ చలం, ఆర్.లక్ష్మణరావు ఎగరవేశారు. అనంతరం శ్రీవాణి ఆధ్యాత్మిక పత్రికను ఆవిష్కరించారు. ఆపై అతిథులను ఘనంగా సత్కరించారు. ఏపీలోని మొత్తం 26 జిల్లాల్లో 1200 మంది యువతీయువకులు ఈ సదస్సుకు హాజరయ్యారు. కార్యక్రమంలో స్నేహలత సాయి, జాతీయ సేవా కో–ఆర్డినేటర్లు, రాష్ట్ర కో–ఆర్డినేటర్లు, సత్యసాయి సేవా సంస్థల జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత


భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద మూసివేసిన ఆలయాలు

అక్కిరెడ్డిపాలెం: చంద్రగ్రహణం కారణంగా నియోజకవర్గంలోని పలు ఆలయాలను మూసివేశారు. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ వినాయక, వేంకటేశ్వర స్వామి వార్ల ఆలయాలను శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మూసివేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు సంప్రోక్షణ అనంతరం ఆలయాలు తెరుస్తామని అర్చకులు తెలిపారు.

గొంతినవానిపాలెంలో అన్న సమారాధన

గాజువాక: శ్రీ పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. 72వ వార్డు గొంతినవానిపాలెం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్లు ఉరుకూటి చందు, రాజాన రామారావు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన దసరా బ్రహ్మోత్సవాలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో దసరా బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజున సహస్రాక్షి అమ్మవారు లలితా మహాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి సన్నిధిలో లలితా సహస్ర నామావళి హోమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభం రోజున ప్రతిష్ఠించిన కలశాల్లోని జలాలతో 9వ అంతస్తులోని బిందు స్థానంలోని సహస్రాక్షి అమ్మవారికి అభిషేకం చేశారు. దివ్య మంగళహారతి అనంతరం నూతన వస్త్రాలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమేరులోని మహా కామేశ్వరునికి,మహా కామేశ్వరీ దేవికి కనుల పండువగా కల్యాణం నిర్వహించారు.

ప్రజలకు చేరువలో వైద్య సేవలు


రోగులకు మందులు అందిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు చేరువలోనే వైద్య సేవలు అందుతున్నాయని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డులోని దల్లివానిపాలెం సచివాలయ పరిధిలో ప్రజలకు సిద్ధేశ్వరం వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతీ ఒక్కరికి ఆరోగ్య భరోసా లభిస్తోందన్నారు. శిబిరాలకు విశేష స్పందన లభిస్తోందన్నారు. శిబిరానికి హాజరైన 265 మందికి ఐదుగురు వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ రాము, ఏఈ వెంకటరావు, సీవో శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే సహించం'


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా అన్నింటినీ ఎదుర్కొంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 989వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎందరో కార్మికుల బలిదానాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'ఉక్కు' ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి వినతి


ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన ఉక్కు జనరల్ ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్య రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ప్రతినిధుల బృందం జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్‌ను శనివారం కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేసింది. వారు మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్య సమస్యలు పెరుగుతుండగా యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి ప్రమాదకరంగా ఉందన్నారు. ఆస్పత్రిలో రోగ నిర్ధారణ పరీక్షలు, రోగికి కావాల్సిన మందులు అందుబాటులో లేవని, దానికి పొంతన లేని కారణాలు చెప్పటం సరికాదని అన్నారు. రోగ నిర్ధారణ, ఆపరేషన్లకు అవసరమైన ఆసుపత్రులను అందుబాటులో ఉంచే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సీజీఎం మాట్లాడుతూ ఈ అంశాలను ఉన్నత యాజమాన్యం తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు వై.టి.దాస్, యు.రామస్వామి, టి.వి.కె.రాజు, నీలకంఠం, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కరాటే చాంపియన్‌షిప్‌లో శివాజీ ప్రతిభ


ద్వితీయ స్థానంలో నిలిచిన శివాజీ

పెదగంట్యాడ: కెనడాలోని కాల్గరీలో ఈ నెల 16 నుంచి 22 వరకు నిర్వహించిన వరల్డ్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే యూనియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని సమతానగర్‌కు చెందిన శివాజీ సత్తా చాటాడు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు క్రీడాకారులు వివిధ విభాగాలకు ఎంపికయ్యారు. అందులో వెటరన్ విభాగంలో జి.శివాజీ సిల్వర్ మెడల్ సాధించారు. టీమ్ ఇండియా కోచ్, మేనేజర్ అయిన శివాజీని గ్రాండ్ మాస్టర్ శ్రీనివాసన్ అభినందించారు.

ఎన్‌ఎంయూ రిలే నిరాహార దీక్ష

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోలో ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. జోనల్ కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంలో డిపో స్పేర్ నుంచి లిస్ట్ అయిన వారికి అదే డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని, ఉద్యోగులకు లీవు సౌకర్యం మెరుగు పరిచి నెలకు మూడు సెలవులు ఇవ్వాలనే పలు డిమాండ్లపై దీక్ష చేపట్టారు. దీక్షలో ఐ.వి.రాణి, ఎస్.వి.రాజు, పి.కె.రావు, కె.పి.నాయుడు, డి.మాణిక్యం, ఎస్.వి.వి.ఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి వైభవంగా ఆర్జిత సేవలు


గరుడసేవలో పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠింపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.